ప్రణాళికలు.. అభివృద్ధి.. పరిశీలన

20వ శతాబ్దం ముందు చాలాకాలంగా అభివృద్ధి స్తంభించిపోయింది. దాంతో తర్వాత చేపట్టిన ప్రణాళికల్లో ఆర్థిక వృద్ధికి పెద్దపీట వేశారు. మన దేశంలో 1991లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం స్థూల ఆర్థిక స్థిరీకరణకు ప్రాధాన్యమిచ్చింది. ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా ఇప్పటివరకు అమలుచేసిన ప్రణాళికల వల్ల మిశ్రమ ఫలితాలు వచ్చాయి. 'వనరుల పంపిణీ సక్రమంగా లేకపోవడంతో ప్రణాళికా లక్ష్యాలను సాధించడం కష్టమైంది'. గ్రామీణాభివృద్ధి, విద్య, ఆరోగ్యం, పారిశుద్ధ్యానికి ప్రాధాన్యమివ్వడం ద్వారా అసమానతలు రూపుమాపడానికి ప్రణాళికాపరమైన కృషి ఎంతో అవసరం.

భారతదేశంలో మిశ్రమ ఆర్థిక వ్యవస్థ నేపథ్యంలో అభివృద్ధి ప్రణాళికలు రూపొందించారు. అనేక డాక్యుమెంట్ల ఆధారంగా ఆర్థిక ప్రణాళికల దీర్ఘకాల లక్ష్యాల్లోని తేడాను గమనించవచ్చు. ఏడో పంచవర్ష ప్రణాళిక వరకు ఆర్థికవృద్ధి, స్వయం సమృద్ధి, నిరుద్యోగ నిర్మూలన, ఆదాయ అసమానతల తొలగింపు, పేదరిక నిర్మూలన, ఆధునికీకరణ అనేవి ప్రణాళికల దీర్ఘకాల లక్ష్యాలు. నాలుగో ప్రణాళిక వరకు ఆర్థికవృద్ధి (నికర జాతీయ ఉత్పత్తిలో వార్షిక పెరుగుదల 5 శాతం)కి అధిక ప్రాధాన్య మివ్వగా... ఐదు, ఆరో ప్రణాళికల్లో స్వయం సమృద్ధి, ఉద్యోగ కల్పన, పేదరిక నిర్మూలనకు ప్రాముఖ్యతనిచ్చారు. 1991 జూన్ లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం స్థూల-ఆర్థిక స్థిరీకరణ సాధనకు పెద్దపీట వేయడంతో భారత ఆర్థిక వ్యవస్థ 'మార్కెట్ ఆధారిత వ్యవస్థ'గా రూపుదిద్దుకుంది.

ప్రణాళికాయుగం మొత్తాన్ని పరిశీలించినపుడు.. ప్రభుత్వం అవలంభించిన విధానాలను కింది విధంగా వర్గీకరించవచ్చు.

- పారిశ్రామికీకరణ తక్కువగా ఉన్న ప్రాంతాలకు సంబంధించిన విధానాలు
- నీటి పారుదల, వ్యవసాయం, సంబంధిత కార్యకలాపాల అభివృద్ధి కోసం విధానాలు
- వెనుకబడిన ప్రాంతాల్లో మౌలిక సౌకర్యాలైన రవాణా, సమాచారానికి సంబంధించిన విధానాలు
- ప్రాంతీయ అసమానతలు తగ్గించే విధంగా కేంద్రం నుంచి రాష్ట్రాలకు వనరులు ప్రణాళిక, గ్రాంట్ల రూపంలో ప్రణాళికేతర సహాయం
- వెనుకబడిన, తక్కువ అభివృద్ధి చెందిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక కార్యక్రమాలు.



పారిశ్రామిక లైసెన్సింగ్ విధానం అభివృద్ధిచెందిన రాష్ట్రాలకే అనుకూలంగా ఉండడంతో నిర్దేశిత లక్ష్య సాధనలో విఫలమైంది. పారిశ్రామిక ఆర్థిక సంస్థలు కూడా అభివృద్ధి చెందిన రాష్ట్రాలకే అనుకూలంగా వ్యవహరించాయి. ప్రణాళికాయుగంలో వ్యవసాయరంగ అభివృద్ధికి కోసం ప్రారంభించిన 'అధిక దిగుబడినిచ్చే వంగడాల కార్యక్రమం' వల్ల ఆహార ధాన్యాల ఉత్పత్తి, ఉత్పాద కత పెరిగింది. పంజాబ్, హర్యానా, పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లో గోధుమ ఉత్పత్తి, ఉత్పాదకత పెరిగింది. తద్వారా ప్రాంతీయ అసమానతలు పెరిగాయి. విద్య, ఆరోగ్య రంగాలపై ప్రణాళికా కేటాయింపులు తక్కువైనందు వల్ల మానవాభివృద్ధి లోపించింది. భూ సంస్కరణలు సక్రమంగా అమలు చేయకపోవడం వల్ల ఆర్థిక అసమానతలు పెరిగాయి.

వాలంటరీ హెల్త్ అసోసియేషన్ నివేదిక 2008 :

అంతర్జాతీయ ప్రమాణాలతోపోల్చినపుడు.. సగటు ఆరోగ్య స్థాయి దేశంలో తక్కువగా ఉంది. ఈ రంగంపై తలసరి వ్యయం కూడా తక్కువే. దేశంలో రాష్ట్రాల మధ్య ఆరోగ్య ప్రమాణాల్లో తేడాలు స్పష్టంగా కన్పిస్తున్నాయి. మొత్తం జనాభాలో 18.8 శాతం కలిగిన కేరళ, మహారాష్ట్ర, హిమాచల్‌ప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల ఆరోగ్య సూచికలు అభివృద్ధి చెందిన, మధ్య ఆదాయ దేశాలైన వెనిజులా, అర్జెంటీనా, సౌదీ అరేబియాలతో సమానంగా ఉన్నాయి. మరోవైపు 42 శాతం జనాభా ఉన్న ఉత్తరప్రదేశ్, ఒరిస్సా, మధ్యప్రదేశ్, అస్సాం, రాజస్థాన్, బీహార్, జార్ఖండ్‌లో ఆరోగ్య సూచికలు సబ్ సహారా ఆఫ్రికా దేశాలు, ఇతర అల్పా దాయ దేశాలైన సూడాన్, నైజీరియా, మయన్మార్‌తో సమానం గా ఉన్నాయి.

దేశంలో ప్రతి వెయ్యి మంది జనాభాకు 0.6 మంది అల్లోపతి డాక్టర్లు ఉన్నారు.వీరు ఎక్కువగా దక్షిణాది రాష్ట్రాలు, అభివృద్ధి చెందిన రాష్ట్రాల్లో కేంద్రీకృతమయ్యారు. వీరి సంఖ్య ఉత్తరప్రదేశ్‌లో కంటే పంజాబ్‌లో 5 రెట్లు ఎక్కువ. గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాల్లో కంటే అర్బన్, సెమీ అర్బన్ ప్రాంతాల్లో వీరి లభ్యత ఎక్కువ. మెడికల్ కళాశాలల ఏర్పాటులో కూడా అసమానతలు ఉన్నాయి. దేశంలోని మొత్తం మెడికల్ కళాశాల ల్లో 63 శాతం, మొత్తం సీట్లలో 67 శాతం 4

దక్షిణాది రాష్ట్రాల్లోనే ఉన్నాయి. నేషనల్ శాంపుల్ సర్వే అభిప్రాయంలో 1995-96, 2003-04 మధ్య పట్టణ ఆస్పత్రుల్లో 126 శాతం, గ్రామీణ ఆస్పత్రుల్లో 78 శాతం వ్యయం పెరిగింది.

మొదటి ప్రణాళిక (1951 ఏప్రిల్ 1-1956 మార్చి 31) :

దేశంలో ప్రజల జీవన ప్రమాణాన్ని మెరుగుపరచడం మొదటి ప్రణాళిక ప్రాథమిక లక్ష్యం. సహజ వనరుల సక్రమ వినియోగం ద్వారా ఈ లక్ష్యాన్ని సాధించవచ్చని భావించారు. ఈ ప్రణాళిక మొత్తం వ్యయం రూ. 2,069 కోట్లు. ఈ మొత్తాన్ని వ్యవసాయ, పారిశ్రామిక, శక్తి, నీటి పారుదల, రవాణా, సమాచారం, సాంఘిక సేవా రంగాలకు కేటాయించారు. స్థూల దేశీయో త్పత్తి వృద్ధి సగటు 2.1 శాతం లక్ష్యం కాగా వాస్తవంగా 3.6 శాతం సాధించారు. దీన్ని పూర్తిగా 'విజయవంతమైన ప్రణాళిక'గా పేర్కొనవచ్చు. ఈ ప్రణాళికా కాలంలో మెట్టూర్, హీరాకుడ్, బాక్రానంగల్ డ్యామ్ లాంటి నీటిపారుదల ప్రాజెక్టులు ప్రారంభించారు. వ్యవసాయంపై ఆధారపడిన భూమి లేని శ్రామికుల పునరావాస సౌకర్యాల కల్పన పట్ల ప్రభుత్వం శ్రద్ధ వహించింది. అనేక సహకార సంస్థల ద్వారా వ్యవ సాయం రంగంలో నూతన పరిజ్ఞానం వినియోగించుకోవడానికి వీరికి శిక్షణ ఇచ్చారు. తంతి తపాలా, రైల్వే సర్వీసులు, రోడ్లు, సివిల్ ఏవియేషన్ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేసింది. పారిశ్రామిక రంగానికి అవసరమైన నిధులు కేటాయించారు. దీంతో పాటు చిన్నతరహా పరిశ్రమల అభివృద్ధికి అదనపు చర్యలు తీసుకున్నారు.

రెండో ప్రణాళిక(1956 ఏప్రిల్1-1961 మార్చి 31వరకు):

రెండో పంచవర్ష ప్రణాళికలో పారిశ్రామిక రంగానికి ప్రాధాన్యమిచ్చారు. ముఖ్యంగా భారీ పరిశ్రమలు ప్రాధాన్యం పొందాయి. పారిశ్రామిక వస్తూత్పత్తి ప్రభుత్వ రంగంలో ఎక్కువగా జరిగింది. 1953లో మహలనోబిస్ రూపొందించిన నమూనా ఆధారంగా రెండో ప్రణాళికను రూపొందించారు. ఆర్థికాభివృద్ధికి సంబంధించిన అనేక అంశాలకు ఈ నమూనా సమాధానమిచ్చింది. దీనిప్రకారం ఆర్థిక వ్యవస్థ 'నియమిత ఆర్థిక వ్యవస్థ'గా ఉండి రెండు రంగాలను కలిగి ఉంటుంది.

1. వినియోగ వస్తు రంగం
2. మూలధన వస్తు రంగం

అయితే ఇలాంటి నియమిత ఆర్థిక వ్యవస్థలో మూలధనం కొరతగా ఉంటుంది. మూలధన వస్తు లభ్యతపై పెట్టుబడులు ఆధారపడి ఉంటాయి. మూలధన వస్తూత్పత్తిని వినియోగ వస్తూత్పత్తి ప్రభావితం చేయలేదు. ఈ నమూనా ప్రకారం అనేక ఉత్పాదక రంగాల్లో నిధుల పంపిణీకి ప్రాధా న్యమివ్వాలి. దీర్ఘకాలంలో ఈ పెట్టుబడుల ద్వారా అధిక ప్రతి ఫలం పొందడం ఈ నమూనా లక్ష్యం.

దుర్గాపూర్, జంషెడ్‌పూర్, భిలాయ్‌లతో పాటు మొత్తం ఐదు ఉక్కు కర్మాగారాలు ఈ ప్రణాళికలో ఏర్పాటయ్యాయి. హైడ్రో ఎలక్ట్రిక్ ప్లాంట్లు ఏర్పాటు చేశారు. బొగ్గు ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. దేశంలో రైల్వేట్రాక్‌ల సంఖ్య నార్త్ ఈస్టన్ ప్రాంతంలో పెరిగాయి. అటామిక్ ఎనర్జీ కమిషన్‌ను 1957లో ఏర్పాటు చేశారు. ఇదే కాలంలో 'టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్' ఏర్పాటైంది. ప్రతిభావంతులైన వ్యక్తులను గుర్తించడానికి ఈ ఇన్‌స్టిట్యూట్ అనేక కార్యక్రమాలు నిర్వహించింది. అణుశక్తికి సంబంధించిన కార్యక్రమాల్లో వీరికి భాగస్వామ్యం కల్పించారు.

మూడో ప్రణాళిక (1961 ఏప్రిల్ 1-1966 మార్చి 31) :

స్వయంసమృద్ధి గల ఆర్థికవ్యవస్థను రూపొందించే లక్ష్యంతో ఈ ప్రణాళిక ప్రారంభమైంది. వ్యవసాయ రంగానికి ప్రాధాన్య మిచ్చారు. కాని 1962లో చైనా-భారత్ యుద్ధ సమయంలో దేశ భద్రత వైపు ప్రభుత్వ దృష్టి మళ్లింది. తర్వాత 1965, 1966 మధ్య కాలంలో హరిత విప్లవంలో భాగంగా వ్యవసాయంపైనే అందరి దృష్టి కేంద్రీకృతమైంది. చైనా-భారత్ యుద్ధం వల్ల అనేక ఉత్పత్తుల ధరలు పెరిగాయి. దీన్ని వ్యయ ప్రేరిత ద్రవ్యోల్బణంగా భావించవచ్చు. ఈ కాలంలో అనేక ఎరువుల, సిమెంట్ తయారీ కర్మాగారాలు నెలకొల్పారు. పంజాబ్‌లో గోధుమ ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. ప్రజాస్వామ్య వ్యవస్థను ప్రోత్సహించే చర్యలో భాగంగా పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో అనేక ప్రాథమిక పాఠశాలలు ప్రారంభించారు. సెకండరీ విద్యకు సంబంధించి అనేక విభాగాలు ఏర్పాటయ్యాయి. రాష్ట్ర విద్యుత్ బోర్డుల ఏర్పాటు ఈ ప్రణాళికలో భాగమే. రోడ్ల నిర్మాణ బాధ్య తను రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించారు.

మూడో ప్రణాళిక లక్ష్యాలు :

- జాతీయాదాయంలో వార్షిక పెరుగుదల 5.6 శాతం
- వ్యవసాయ ఉత్పత్తిలో స్వయం సమృద్ధి
- నిరుద్యోగాన్ని తగ్గించడం
- ప్రజలందరికీ సమాన హక్కులు

చైనా, పాకిస్థాన్‌లతో యుద్ధాలు, చమురు ధరల పెరుగుదలతో చెల్లింపుల శేషంలో అసమతౌల్యం తీవ్రమైంది. దీన్ని పూర్తిగా విఫలమైన ప్రణాళికగా భావించవచ్చు.

ప్రణాళికలు ప్రారంభమైన మొదటి 15 ఏళ్లల్లో పారిశ్రామిక రంగంలో గమనించిన నిర్మాణాత్మక మార్పు వనరుల కేటాయింపులో వినియోగ వస్తు పరిశ్రమల స్థానంలో మూలధన వస్తు పరిశ్రమలకు ప్రాధాన్యతనివ్వడం. మూడో ప్రణాళిక లక్ష్యాల సాధనలో విఫలమైనందువల్ల 4వ ప్రణాళిక వెంటనే ప్రకటించకుండా ప్రణాళికా విరామం(1966-69) పాటించారు.

వార్షిక ప్రణాళికలు 1966-69 :

మూడు వార్షిక ప్రణాళికల మొత్తం వ్యయం రూ. 6,625 కోట్లు కాగా దీనిలో 22.8 శాతం పరిశ్రమలు, ఖనిజాలకు కేటాయించారు. మిగతా వ్యయంలో 18.5 శాతం రవాణా, సమాచార రంగం, 18.3 శాతం శక్తి, 16.7 శాతం వ్యవసాయ రంగానికి కేటాయించారు. ప్రణాళికా కేటాయింపుల్లో శక్తి రంగానికి మొదటి ప్రణాళికలో 7.6 శాతం, రెండో

ప్రణాళికలో 9.7 శాతం, మూడో ప్రణాళికలో 14.6 శాతం కేటాయించగా వార్షిక ప్రణాళికల్లో ఈ రంగానికి కేటాయింపు ఎక్కువగా ఉండటం గమనించవచ్చు. విద్యుత్ కొరత ఎక్కువగా ఉండి పారిశ్రామిక ఉత్పత్తి ప్రతికూలంగా ఉన్నందువల్ల వార్షిక ప్రణాళికల్లో శక్తి రంగానికి కేటాయింపులు పెంచారు.

ముఖ్యాంశాలు :

- అటామిక్ ఎనర్జీ కమిషన్‌ను రెండో ప్రణాళికా కాలంలో 1957లో ఏర్పాటు చేశారు.
- మహలనోబిస్ నమూనా ప్రకారం ఆర్థిక వ్యవస్థలో వినియోగ వస్తు రంగం, మూలధన వస్తు రంగం అనే రెండు రంగాలుంటాయి.
- చైనా–భారత్ యుద్ధ సమయంలో (1962) ఏర్పడింది వ్యయప్రేరిత ద్రవ్యోల్బణం.
- రాష్ట్ర విద్యుత్ బోర్డులు మూడో ప్రణాళికలో ఏర్పాటయ్యాయి.
- ప్రాంతీయ సమతౌల్య అభివృద్ధికి మూడో ప్రణాళిక ప్రాధాన్యమిచ్చింది.
- ప్రతి వెయ్యి మంది జనాభాకు అలోపతిక్ డాక్టర్ల సంఖ్య 0.6. వీరి లభ్యత దక్షిణ రాష్ట్రాలు, అభివృద్ధి చెందిన పంజాబ్‌లో ఎక్కువ.
- నేషనల్ శాంపుల్ సర్వే అభిప్రాయంలో పట్టణ ఆస్పత్రుల్లో 126 శాతం, గ్రామీణ ఆస్పత్రుల్లో 78 శాతం వ్యయం పెరిగింది.